క్లుప్తంగా

రూ.19.18కోట్లతో వైరా మున్సిపల్ బడ్జెట్

వైరా: వైరా మున్సిపాలిటీకి 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను రూ.19.18కోట్లతో ఆమోదించారు. ఈ మేరకు ప్రతిపాదనలను కమిషనర్ చింతా వేణు..అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజకు పంపించగా ఆమె ఆమోదం తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నిల్వ రూ.2.96కోట్లుగా పేర్కొనగా వచ్చే ఆర్థిక సంవత్సరం సాధారణ ఆదాయం రూ.4.44 కోట్లుగా, ప్రభుత్వం నుంచి వివిధ రూపాల్లో రూ.11.78కోట్ల ఆదాయం వస్తుందని అంచనాల్లో పొందుపర్చారు. మొత్తంగా రూ.19.18కోట్ల ఆదాయం సమకూరుతుందని, ఇందులో వ్యయం పోగా రూ.45లక్షలు మిగిలే అవకాశం ఉందని బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

శ్రద్ధగా చదివితే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్

మధిర: విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఎంచుకుని శ్రద్ధగా చదివితే మంచి ఫలితాలు వస్తాయని ఎంఈఓ వై.ప్రభాకర్ తెలిపారు. మండలంలోని నాగవరప్పాడు ప్రాథమిక పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం హెచ్‌ఎం పురం సంగారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరడం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మాటూరు కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీహరి, ఉపాధ్యాయుల తోకా కష్టయ్య, రవికుమార్ లింగయ్య పాల్గొన్నారు.

యూనిఫాం సిద్ధం చేయాలి

సత్తుపల్లిటౌన్: మే 20వ తేదీ కల్లా ప్రభుత్వ విద్యార్థులకు అందించే యూనిఫాం సిద్ధంగా ఉంచాలని ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు స్పష్టం చేశారు. సత్తుపల్లిలో బుధవారం స్వయం సహాయక సంఘాలకు విద్యార్థుల యూనిఫాం క్లాత్‌ను కుట్టుపని కోసం అందించి మాట్లాడారు. మండలంలోని 61 పాఠశాలల్లోని 3,386 మంది విద్యార్థులకు 6,123 మీటర్ల యూనిఫాం క్లాత్‌ను ప్రభుత్వం సరఫరా చేసిందని, యూనిఫాంను నాణ్యతతో కుట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం సత్యవర్ధన్‌రాజు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు యాకోబు, జయరాజు, శైలకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ యాత్ర

ఏన్కూరు: వాటర్‌షెడ్ ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని డీఆర్డీఓ సన్యాసయ్య తెలిపారు. మండలంలోని రాయమాదారం గ్రామ పంచాయతీలో బుధవారం వాటర్‌షెడ్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన క్రింద వాటర్‌షెడ్ పథకం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ కేవీ నారాయణ, ఏపీడీ వెంకటరాజు, ఎంపీడీఓ సకినాల రమేష్, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి నర్సింహారావు, పశువైద్యనిపుణులు స్వాతి, ఏపీఎం వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో విద్యార్థిని ప్రతిభ

వైరా: వైరాలోని విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థి సాత్విక్ రన్ నవోదయకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ జయప్రకాశ్ తెలిపారు. వేలమంది పోటీ పడ్డ పరీక్షల్లో తమ విద్యార్థి విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని మాజీ వార్డ్ కౌన్సిలర్ మాదినేని సునీత, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

సన్మానం..

తల్లాడ: మండలంలోని రెడ్డిగూడెంలో గోశాల నిర్వాహకుడు కొత్త సత్యనారాయణరెడ్డిని బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో సన్మానించారు. సత్యనారాయణరెడ్డి గత సంవత్సరం నుంచి 50 ఆవులతో నిర్వహిస్తున్న గోశాలను బీజేపీ నాయకులు సందర్శించి.. సత్యనారాయణరెడ్డిని, గోశాలకు సహకరిస్తున్న తల్లపురెడ్డిపెద్ద బస్విరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటరామరావు, సుధాకర్, రాము, నాగిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలులో బుధవారం 400మంది పేద ముస్లింలకు.. ముస్లిం ఐక్య సంఘం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు మౌలానా షేక్ ముజాహిద్, ఎస్సై వెంకటేష్ రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముస్లిం ఐక్య సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించి, సంఘ సేవలను కొనియాడారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడె జనాబ్ షేక్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌసుద్దీన్, షేక్ బాసిత్ అలీ, షేక్ మొహమ్మద్ రఫీ, షేక్ నాగుల్ మీరా, ఇస్మాయిల్, మహబూ, నాగుల్‌మీరా, జానీబాషా, తదితరులున్నారు.

మున్సిపాలిటీల్లో.. వన్‌టైం సెటిల్‌మెంట్

- ఆస్తిపన్ను వడ్డీపై 90శాతం మాఫీ
- ఇంకా మిగిలింది ఐదురోజులే..



సత్తుపల్లి మున్సిపాలిటీ కార్యాలయం

మున్సిపాలిటీ	మొత్తం ఆస్తిపన్ను (రూ.కోట్లలో)	ఆస్తిపన్ను వసూళ్ల శాతం
సత్తుపల్లి	4.91	80.86
మధిర	2.56	67.58
వైరా	4.13	47.46

సత్తుపల్లిటౌన్: ఆస్తిపన్ను వసూళ్లకు ఇంకా మిగిలింది ఐదురోజులే.. ప్రభుత్వం మంగళవారం రాత్రి మున్సిపాలిటీల్లో వన్‌టైం సెటిల్‌మెంట్ పథకం అమలు చేస్తూ ఆస్తి పన్ను వడ్డీపై 90శాతం మాఫీకి ఉత్తర్వ్యులు జారీ అయ్యాయి. ఆర్థిక సంవత్సరం మరో ఐదురోజుల్లో ముగియనున్న క్రమంలో రాయితీ ప్రకటన పురప్రజలకు ఊరటనిచ్చింది. ఇప్పటి వరకు వడ్డీతో ఆస్తి పన్ను చెల్లించిన వారికి కూడా వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను సర్దుబాటు చేయబడుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఓటీఎస్ పథకాన్ని వినియోగించుకొని దీర్ఘకాలంగా బకాయిపడిన వారు పన్నులు చెల్లించాలని అధికారులు సూచిస్తున్నారు.

మున్సిపాలిటీల్లో స్పెషల్ డ్రైవ్..

ఇప్పటికే మున్సిపాటీల్లో ముమ్మరంగా పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. బకాయిలు ఉన్న ఇంటి యజమానులకు రెడ్ నోటీసులు జారీ చేశారు. సత్తుపల్లి మున్సిపాలిటీలో రూ.4.91 కోట్ల ఆస్తి పన్ను డిమాండ్ ఉండగా.. ఇప్పటి వరకు రూ. 3.96 కోట్లు పన్నులు వసూళ్లు అయ్యాయి. ఇంకా రూ.94 లక్షలు బకాయిలు ఉన్నాయి. మున్సిపాలిటీలోని 9,727 అసెస్‌మెంట్లకు గాను 8,042 మంది పన్నులు చెల్లించారు. ఇంకా 1,682 మంది ఆస్తి పన్ను, వడ్డీతో కలిపి రూ. 92.24 లక్షలు ఉండగా 90శాతం వడ్డీ మాఫీతో రూ.18.79 లక్షలు ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీనికి ఈ ఐదు రోజుల్లో వసూళ్లు చేసేందుకు మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. అయితే మున్సిపాలిటీలోని ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఏళ్ల తరబడి రూ.98 లక్షల వరకు మొండి బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి.

సద్వినియోగం చేసుకోండి..



ప్రభుత్వం ప్రకటించిన వన్‌టైం సెటిల్‌మెంట్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకే 90శాతం వడ్డీ మాఫీ అందుబాటులో ఉంటుంది. గతంలో చెల్లించిన వారికి కూడా వడ్డీ అమల్లై వచ్చే ఏడాది పన్నులో సర్దుబాటు చేస్తాం.

– కె.నర్సింహా, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

చెన్నూరుకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

- రూ.200 కోట్ల వ్యయంతో నిర్మాణం
- స్థలాన్ని సర్వే చేస్తున్న అధికారులు



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజేంద్రగౌడ్, అధికారులు

కల్లూరురూరల్: సత్తుపల్లి నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను చెన్నూరులో నిర్మించనున్నారు. సుమారు రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కావాల్సిన 25 ఎకరాల స్థలాన్ని చెన్నూరులో రైతుల సహకారంతో సేకరిస్తున్నారు. ఈ మేరకు కల్లూరు ఆర్డీఓ రాజేంద్రగౌడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ పులి సాంబశివుడు సిబ్బందితో బుధవారం చెన్నూరులోని భూమి సర్వే చేపట్టారు. ఈ సర్వేకు రైతులు తమ స్థలాన్ని సైతం వితరణ చేసేందుకు ముందుకు రావడంతో అధికారులు స్థలాన్ని సర్వే చేసి ప్రభుత్వానికి అప్పగించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, మంత్రులు సంకల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుజాతతో పాటు సర్వేయర్లు, చెన్నూరు గ్రామ ప్రముఖులు, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధిహామీ ప్రజావేదిక



ఉపాధిహామీ ఓపెన్ ఫోరంలో విచారణ చేస్తున్న అధికారులు

కారేపల్లి: సింగరేణి మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై చేపట్టిన సామాజిక తనిఖీ రెండోరోజు బుధవారంతో ముగిసింది. ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉపాధిహామీ ఓపెన్ ఫోరంలో.. మండల వ్యాప్తంగా జరిగిన ఉపాధి పనుల్లో రూ.2,36,237లు దుర్వినియోగం అయినట్లు అధికారులు తేల్చారు. రూ.1,15,000లు సంబంధిత అధికారులపై జరిమానా విధించటంతో పాటు, రూ. 1,21,000లు బాధిత ఉపాధిహామీ సిబ్బంది నుంచి రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి రూ.15,532లు రికవరీకి ఆదేశించారు. 15 రోజుల్లో రికార్డులకు సంబంధించి పున:పరిశీలన చేసి తిరిగి దాఖలు చేస్తే జరిమానా, రికవరీలలో మినహాయింపు ఉంటుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేందర్, డీవీఓ సక్రియా, ఏపీఓలు పవన్‌కుమార్, శాస్త్రి, ఏపీడీ శ్రీదేవి, ఎంపీఓ రవీంద్రప్రసాద్, క్వాలిటీ కంట్రోల్ అధికారి వీరయ్య, సిబ్బంది రమేష్, బాబు, గంగరాజు, రజిత, అజయ్‌కుమార్, కోటేశ్వరరావు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి సునీల్‌రెడ్డి

సత్తుపల్లిరూరల్: వరికోతలు ప్రారంభం కావటంతో సత్తుపల్లి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మండల ప్రత్యేక అధికారి టి.సునీల్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29వ తేదీలోపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు.. వేసవి దృష్ట్యా కుర్చీలు, టెంట్లు, మంచినీళ్ల వంటి మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యోగేశ్వరరావు, ఎంపీడీఓ చిన్ననాగేశ్వరరావు, వ్యవసాయాధికారి శ్రీనివాస్, సాంబశివరావు, ఏపీఎం సత్యవర్ధన్‌రాజు, సొసైటీల సీఈఓలు, ఏఈఓలు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

వితరణలు వెల్లువ..

జేవీఆర్ కళాశాలకు ఐదు క్వింటాళ్ల బియ్యం..



ఐదు క్వింటాళ్ల బియ్యంతో ప్రిన్సిపాల్ డాక్టర్ గోపి, అధ్యాపకులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థుల మధ్యాహ్న భోజనానికై ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ దంపతులు బుధవారం ఐదు క్వింటాళ్ల బియ్యం వితరణగా అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపి, అధ్యాపకులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇఫ్తార్ విందుకు రూ.50వేలు..



నగదు అందిస్తున్న తహసీల్దార్ ఉషాశారద

ఎర్రుపాలెం: రంజాన్ పర్వదినం సందర్భంగా ఇఫ్తార్ విందు కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50వేల నగదును బుధవారం మండలకేంద్రంలోని మజీద్ కమిటీ అధ్యక్షుడు షేక్.ఇస్మాయిల్‌కు.. తహసీల్దార్ ఉషాశారద అందించారు. 29న ఇఫ్తార్ విందు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు షేక్ మహబూబ్ తదితరులున్నారు.

నిరుపేద కుటుంబాలకు నిత్యావసరాలు..



నిత్యావసరాలు అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తల్లాడ: తల్లాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. దగ్గుల ప్రభాకర్‌రెడ్డి వివాహ దినోత్సవం సందర్భంగా నిరుపేదలకు నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, మురళి, నరసింహారావు పాల్గొన్నారు.

యువతీ యువకులకు పుస్తకాలు..

కొణిజర్ల: మండలంలోని చిన్నగోపతిలో వాసిక్ ఫౌండేషన్, శాలివాహనా వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న యువతీ యువకులకు ఉచిత పుస్తకాలు పంపిణీ చేశారు. గ్రామ కార్యదర్శి పొన్నగంటి జ్యోతి సోషల్ వర్కర్ దునుకు యాలాద్రి అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు నరేష్, ప్రజాపతి భాస్కరరెడ్డి, భద్రయ్య, విజయరాజు పాల్గొన్నారు.

మడుపల్లి శివాలయంలో వార్షిక అభిషేకాలు

మధిర: మున్సిపాలిటీ పరిధి మడుపల్లిలోని శ్రీ రాజరాజ నరేంద్ర స్వామి శివాలయంలో రానున్న ఉగాది నుండి వార్షిక అభిషేకాలు, పూజలు ప్రారంభిస్తున్నట్లు ప్రధాన అర్చకులు దాములూరి సతీష్‌శర్మ తెలిపారు. బ్రహ్మసూత్రం కలిగి పది శతాబ్దాల చరిత్ర ఉన్న ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని వెల్లడించారు. భక్తులు రూ.2.516 చెల్లిస్తే ఏడాది పాటు గోత్రనామాలతో పూజలు చేస్తామని, వివరాలకు 89194 29238 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వైద్య సేవలు భేష్..



సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిని సందర్శిస్తున్న కాయకల్ప బృందం

సత్తుపల్లి: రికార్డుల నిర్వహణ, పరిశుభ్రత, రోగులకు వైద్య సేవలు అందించటంలో ఏరియా ఆస్పత్రి సేవలు భేష్ అని కాయకల్ప బృందం పేర్కొంది. బుధవారం సత్తుపల్లి ఏరియా ఆస్పత్రిని కాయకల్పబృందం సందర్శించింది. ఆస్పత్రిలోని జనరల్ వార్డు, క్యాజువాల్టీ, కాన్పుల గది, ఆపరేషన్ థియేటర్, ఆస్పత్రి పరిసరాలు, దయాలసిస్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో కాయకల్ప బృందం వైద్యులు డాక్టర్ హర్షవర్ధన్, హెచ్‌ఎన్‌లు నాగేంద్రమ్మ, ఫర్జానా, అర్మల, ఫార్మాసిస్టు రజినిలతో పాటు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

బోనకల్: బాలల హక్కులను పరిరక్షించాలని మధిర అసిస్టెంట్ లేబర్ కె.చంద్రం, తహసీల్దార్ పున్నం చందర్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాలల పరిరక్షణ మండల స్థాయి కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు బాల్యవివాహాలు చేస్తే చట్ట ప్రకారం శిక్షకు అర్హులవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ దానయ్య, ఔట్‌రీచ్ వర్కర్ ఎండీ లాల్‌బీ, ఐకేపీ ఏపీఎం సురేందర్ బాబు, ఎఫర్ట్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో తీవ్రగాయాలు

కారేపల్లి: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని పోలంపల్లికి చెందిన ఈసం వినీత్ బైక్‌పై బుధవారం కారేపల్లి బస్టాండ్ సెంటర్ నుంచి సినిమాహాల్ సెంటర్ వైపు వెళ్తున్నాడు. ఈక్రమాన ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో వినీత్ తలకు తీవ్రగాయాలు కాగా స్థానికులు కారేపల్లిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

మాజీ జెడ్పీటీసీకి పరామర్శ

కల్లూరురూరల్: కల్లూరు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కట్టా అజయ్‌కుమార్ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకోగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించారు. ఆయన స్వగ్రామమైన మండలంలోని పోచవరంలో అజయ్‌ను పరామర్శించి ఆరోగ్యంపై ఆరా తీశారు. డీసీసీబీ డైరెక్టర్ బోబోలు లక్ష్మణ్‌రావు, సొసైటీల చైర్మన్లు చావా వెంకటేశ్వరరావు, నర్వనేని అంజయ్య, నాయకులు కాటమనేని వెంకటేశ్వరరావు, పెడకంటి రామకృష్ణ, షేక్ కమ్లీ తదితరులు పాల్గొన్నారు.



వైరా : ఒకటో వార్డులో షేక్ సన, ఆమె తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఎస్సీ డీడీ సత్యనారాయణ

ఆడపిల్ల భారం కాదు.. వరం!

ఆడపిల్లలు జన్మించిన తల్లిదండ్రులు భారంలా కాకుండా వరంలా భావించాలని అధికారులు సూచించారు. ఆడశిశువులకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను ప్రోత్సహించేలా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆలోచనలతో 'మా పాప – మా ఇంటి మణిదీపం' పేరిట కొత్త కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా జిల్లాలో ఆడపిల్లకు జన్మనిచ్చిన దంపతులను జిల్లా యంత్రాంగం తరపున సన్మానించడంతో స్వీట్ బాక్స్, ప్రశంసాపత్రం ఇచ్చేలా నిర్వహించే ఆడపిల్ల జన్మోత్సవ వేడుకలను బుధవారం ప్రారంభించారు. ఈమేరకు వివిధ ప్రాంతాల్లో జిల్లా స్థాయి అధికారులు పాల్గొని తల్లిదండ్రులను సన్మానించారు. – సాక్షి నెట్‌వర్క్



మధిర : 11వ వార్డు ఎస్సీ కాలనీలో తల్లిదండ్రులను సన్మానిస్తున్న సీపీఓ శ్రీనివాస్



చింతకాని : రాణి – నాగరాజును సన్మానిస్తున్న డీపీఓ ఆశాలత



బోనకల్ : బ్రాహ్మణపల్లిలో తల్లిదండ్రులను సన్మానిస్తున్న డీఎంహెచ్ఓ కళావతిబాయి



కారేపల్లి : దంపతులను అభినందిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు



ముదిగొండ : వల్లభిలో మౌనిక – కృష్ణను సన్మానిస్తున్న అధికారులు



ఏన్కూరు : చిన్నారి తల్లిదండ్రులను సన్మానిస్తున్న మైనింగ్ ఏడీ సాయినాథ్

కల్లూరు మసీదులో ఇఫ్తార్



ఇఫ్తార్ విందు నిర్వహిస్తున్న దృశ్యం

కల్లూరు: కల్లూరు జామియా మసీదులో ఎస్‌కే ఉస్మాన్, తురాబల్లిలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిధిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం, ముస్లిమేతరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎల్.రాజేందర్, ఏసీపీ రఘు, సీఐ ముత్తు లింగయ్య, ఎస్సై హరిత, తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓ నందిశెట్టి నాగేశ్వరరావు, ముస్లిం ప్రముఖులు సయ్యద్ అలీ, ఎండీ హనీఫ్, అమీరుద్దీన్, ఎస్‌కే యాకూబ్ అలీ, హమీద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి చెరువుకు మరమ్మతులు చేయించండి

కల్లూరు: సాగర్ ఎమవ కాల్వ పరిధిలోని పుల్లయ్య బంజర్ తూము–2కు కాలువ తవ్వడం కాకుండా సంగారెడ్డి చెరువుకు మరమ్మతులు చేయిస్తే మూడు గ్రామాల రైతులకు ఉపమోగకరంగా ఉంటుందని పలువురు పేర్కొన్నారు. ఈ బుధవారం జరిగిన ఆయకట్టు రైతుల సమావేశంలో ఉబ్బన గోపాలస్వామి, ఉబ్బన రామారావు, బి.వీరస్వామి, సీహెచ్.రామారావు మాట్లాడుతూ చెరువు కింద పుల్లయ్య బంజర్, లక్ష్మీపురం, కల్లూరు గ్రామాలకు చెందిన రైతుల 654 ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. చెరువు లోతట్టులో ఆక్రమించుకుని పొలాలు వేసిన కొందరి తీరుతో ముంపు ఎదురతోందన్నారు. కానీ ఈ విషయంలో ఎమ్మెల్యేకి తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. ఈమేరకు కాల్వ తవ్వకుండా, చెరువు రెండు తూముల మరమ్మతు చేయించడంపై ఎమ్మెల్యే రాగమయి దృష్టి సారించాలని కోరారు. ఈసమావేశంలో వి.వెంకటేశ్వరరావు, వి.రంగారావు ఎస్.గాయత్రి, బి.నాగరాజు పాల్గొన్నారు.

కళాకారులకు ఉగాది పురస్కారాలు



మున్సిపల్ కమిషనర్ వేణును సత్కరిస్తున్న దృశ్యం

వైరా: వైరాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఐక్యవేదిక 17వ వార్షికోత్సవం, వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మెండెం ఇసాక్ బాబు రెండో వర్ధంతి సందర్భంగా పలువురు రంగస్థల కళాకారులకు బుధవారం ఉగాది పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మాజీ ఎంపీపీ కృష్ణార్జునరావు పాల్గొని కళారంగంలో సేవలందించిన పలువురిని సత్కరించారు. ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి పూర్ణకంటి రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చింతా వేణు, ఎస్ఐ వంశీ కృష్ణ భాగ్యరాజ్, చింతకాని తహసీల్దార్ అనంతరాజుతో పాటు దార్న రాజశేఖర్, అర్జునరావు, బాబీ, కిరణ్, లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలుచేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చింతకాని: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించగా ఆయన మాట్లాడారు. సంపద సృష్టించి ప్రజలకు పంచుతామని చెప్పిన నేతలు.. ఇప్పుడు రుణమాఫీ, రైతుభరోసా, ఆత్మీయ భరోసా, మహిళలకు రూ.2,500 భృతి తదితర పథకాలను విస్మరించారని ఆరోపించారు. ఇకనైనా హామీలను అమలుచేయడమే కాక మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ తహసీల్దార్ కూరపాటి అనంతరాజుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మునుకుంట్ల సుబ్బారావు, రాఘవరెడ్డి, రాచబంటి రాము, వత్సవాయి జానికిరాములు, మద్దిని బస్వయ్య, మడిపల్లి కిరణ్‌బాబు, నన్నక కృష్ణమూర్తి, గద్దం రమణ, లింగం కోటేశ్వరరావు, మాదిని రవి, నక్కనబోయిన శాంతారావు పాల్గొన్నారు.

- పెనుబల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా హామీలు అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు అన్నారు. బుధవారం పెనుబల్లిలో నిర్వహించిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వీఓఏలను అడ్డుకొని అరెస్ట్ చేయడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, డివిజన్ కమిటీ సభ్యురాలు నాగమణి, నాయకులు పాల్గొన్నారు.